సాక్షి
అన్నమయ్య జిల్లా
శుక్రవారం । 4 । అక్టోబర్ । 2024

దసరా సంబరం..
ఘనంగా ప్రారంభం


డోలు వాయిస్తున్న యువతి

ఉమ్మడి వైఎస్సార్ జిల్లాల్లో దసరా ప్రారంభోత్సవాలు గురువారం అంగరంగ వైభవంగా జరిగాయి. రంగురంగుల పూలతో.. విద్యుద్దీప అలంకారాలతో ఆలయాలు శోభిల్లాయి. తొలిరోజు 'అమ్మవారు' వివిధ రూపాల్లో దర్శనమిచ్చారు. సిరులతల్లిని తిలకించిన భక్తులు పులకించి పోయారు. చల్లగా చూడమ్మా అంటూ వేడుకున్నారు.

- శోభిల్లిన అమ్మవారి ఆలయాలు
- ఆకట్టుకున్న కళాకారుల ప్రదర్శనలు


ప్రొద్దుటూరు అమ్మవారిశాలలో శ్రీ రాజరాజేశ్వరిదేవిగా దర్శనమిచ్చిన అమ్మవారు


రాజంపేటటౌన్: శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి దేవి ఉత్సవ మూర్తిని పురవీధుల్లో ఊరేగిస్తున్న ఆర్యవైశ్యులు


రాయచోటిలోని వీరభద్రస్వామి ఆలయంలో భద్రకాళీగా అమ్మవారు

ప్రొద్దుటూరు కల్చరల్/రాజంపేటటౌన్/రాయచోటిటౌన్: : దసరా ఉత్సవాల నిర్వహణలో రెండో మైసూరుగా ఖ్యాతి గడించిన పుత్తడిపురం ప్రొద్దుటూరులో దసరా ఉత్సవాలు గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆలయాల దసరా ఉత్సవ కమిటీల వారు దేవీ శరన్నవరాత్రి వేడుకల్లో భాగంగా ఉదయం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి కలశాలతో గ్రామోత్సవం నిర్వహించారు. 102 మంది ఆర్యవైశ్య సుహాసినులు అగస్త్యేశ్వర స్వామి ఆలయం నుంచి కలశాలలో నింపిన నవగంగ తీర్థాలను ఊరేగింపుగా తీసుకొచ్చి అమ్మవారికి అభిషేకం చేశారు. కన్యకాపరమేశ్వరిదేవి ఆలయం నుంచి మంగళవాయిద్యాలతో, బాణసంచా పేలుళ్లతో ఊరేగింపుగా బయల్దేరి తెల్లాకుల శివయ్యగారి నగరేశ్వరస్వామి దేవస్థానం నుంచి చినవీరయ్య శెట్టి రచించిన శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరిదేవి పురాణాన్ని తీసుకురావడంతో ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. పూణేకు చెందిన 70 మంది కళాకారుల సంస్కృతి వాయిద్య పథక్ సుయోగ్ బ్రాస్ బ్యాండ్, హర్యాణాకు చెందిన భంభంభోలే శివుడు, సాధువుల వేషధారణలో భస్మం చల్లుకుంటూ కళాకారుల ప్రదర్శన, బాణసంచా పేలుళ్లు, పాలకొల్లు బ్యాండ్, కోలాటం ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఆర్యవైశ్యసభ అధ్యక్షుడు బుశెట్టి రాం మోహన్ రావు, కార్యదర్శి మురికి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

- ఉమ్మడి వైఎస్ఆర్ జిల్లాలోని రాజంపేట అమ్మవారిశాలలో ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు గ్రందే నాగ సత్యనారాయణ గుప్త ఆధ్వర్యంలో ఉత్సవాలకు అంకురార్పణ చేశారు. అనంతరం ఆర్యవైశ్యులు శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరిదేవి ఉత్సవ మూర్తిని పురవీధుల్లో ఊరేగించారు.రాయచోటిలోని శ్రీ భద్రకాళీ సమేత శ్రీ వీరభద్రస్వామి ఆలయంలో అమ్మవారిని అర్చకులు శ్రీ భద్రకాళీ రూపంలో అలంకరించారు.

న్యూస్‌రీల్

రేపు జిల్లా ఫుట్‌బాల్ జట్టు ఎంపిక

మదనపల్లె సిటీ: జిల్లా ఫుట్‌బాల్ పురుషుల జట్టును శనివారం ఎంపిక చేయనున్నట్లు జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ సభ్యులు దిలీప్‌కుమార్, మురళీధర్ తెలిపారు.స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఉదయం 7గంటలకు ఎంపికలు జరుగుతాయన్నారు. వివరాలకు 9502074146 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

ప్రశాంతంగా 'టెట్'

రాయచోటి: ఉపాధ్యాయ అర్హత పరీక్ష(టెట్) జిల్లాలో ప్రశాంతంగా జరిగింది. గురువారం పేపర్–1, పేపర్–2లకు 820 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో 686 మంది మాత్రమే హాజరైనట్లు జిల్లా విద్యాశాఖ అధికారి శివప్రకాష్‌రెడ్డి తెలిపారు. జిల్లాలోని నాలుగు ఇంజినీరింగ్ కళాశాలల్లో పకడ్బందీగా పరీక్షలు నిర్వహించామని డీఈఓ చెప్పారు.

లింగనిర్ధారణ పరీక్షలపై అవగాహన


మాట్లాడుతున్న డీఐఓ ఉషశ్రీ

రాజంపేట: లింగనిర్ధారణ పరీక్షలపై పలు ఆసుపత్రుల వైద్యులు, స్కానింగ్ సెంటర్ నిర్వాహకులకు గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రాజంపేటలోని ఇండియన్ మెడికల్ హాల్‌లో నిర్వహించిన పీసీపీఎన్‌డీటీ సమావేశానికి జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారిణి(డీఐఓ) ఉషశ్రీ, ప్రోగ్రాం ఆఫీసర్ దేవశిరోమణి, డిప్యూటీ డీఎం హెచ్‌వో సానే శేఖర్‌లు హాజరయ్యారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ గర్భిణులకు ఆడ, మగ అనేది చెప్పరాదన్నారు. ఒక వేళ చెబితే చట్టపరమైన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

పిడుగు పాటుతో ముగ్గురు మృతి


మృతులు శివపార్వతి, తేజేశ్వర్‌రెడ్డి, మారుతిప్రసాద్‌రెడ్డి

పెండ్లిమర్రి: వైఎస్సార్ కడప జిల్లా పెండ్లిమర్రి మండలం తుమ్మలూరు గ్రామ సమీపంలోని పొలాల్లో గురువారం సాయంత్రం గాలి, వానతో పాటు వేరు వేరు చోట్లు పిడుగులు పడ్డాయి. దీంతో పిడుగు పాటుకు గురైన తుమ్మలూరు గ్రామానికి చెందిన నందిరెడ్డి శివపార్వతి(30), నందిరెడ్డి తేజేశ్వర్‌రెడ్డి(12), పగడాలపల్లె గ్రామానికి చెందిన జి.మారుతి ప్రసాద్‌రెడ్డి(25) మృతి చెందారు. నాగాయపల్లె గ్రామానికి చెందిన నరేష్‌కుమార్‌రెడ్డికి గాయాలై స్పృహ కోల్పోయాడు. స్థానికుల కథనం మేరకు.... శివపార్వతి, తేజేశ్వర్‌రెడ్డిలు గ్రామ సమీపంలోని పొలాల్లోకి పశువులను మేపుకోవడానికి వెళ్లారు. గాలి, వాన రావడంతో సమీపంలోని చెట్టు వద్దకు వచ్చారు. చెట్టు వద్ద ఉన్న ఇద్దరిపై పిడుగు పడి అక్కడిక్కడే మృతి చెందారు. తేజేశ్వర్‌రెడ్డి వెల్లటూరులోని సత్యసాయి హైస్కూల్‌లో ఆరో తరగతి చదువుతుండేవాడు. పగడాలపల్లె గ్రామానికి చెందిన మారుతిప్రసాద్‌రెడ్డి, నరేష్‌కుమార్‌రెడ్డి మరి కొందరు కలిసి తుమ్మలూరు సమీపంలోని పాపాఘ్ని నది నుంచి అక్రమంగా ట్రాక్టర్‌లో ఇసుక తరలించడానికి కూలీ పనులకు వెళ్లారు. ట్రాక్టర్‌కు ఇసుక నింపి మళ్లీ ట్రిప్పు తోలడానికి అక్కడే ఉండగా, వర్షంతో పాటు పిడుగు పడి మారుతి ప్రసాద్‌రెడ్డి మృతి చెందాడు. నరేష్‌కుమార్‌రెడ్డి గాయాలతో స్పృహ కోల్పోవడంతో ప్రయివేట్ అసుపత్రికి తరలించారు.

ఇసుకే బంగారమాయె!

- జిల్లా అంతటికీ కలిపి ఒకే ఒక్క నిల్వ కేంద్రం
- ఎక్కడికక్కడ స్థానికంగానే దోచుకుంటున్న తమ్ముళ్లు
- నదులు, వాగుల్లో రాత్రికి రాత్రే అక్రమ రవాణా

సాక్షి రాయచోటి: ఇసుక నిజంగానే బంగారమవుతోంది. రాష్ట్ర ప్రభుత్వం ఉచిత ఇసుక అంటూ అట్టహాసం చేస్తున్నా అందరికీ అందడం గగనంగా మారింది. అధికార పార్టీ అండదండలు ఉంటూనే సులువుగా దొరుకుతోంది. లేకపోతే రోజుల తరబడి నిరీక్షణ తప్పడం లేదు. ప్రధానంగా జిల్లా అంతటికీ ఒక్క స్టాక్ పాయింట్ మాత్రమే పెట్టడం తెలుగు తమ్ముళ్లకు కలిసొచ్చిందనే చెప్పవచ్చు. ఇదే అదునుగా తమ్ముళ్లు రాత్రికి రాత్రి నదుల్లో ఇసుక అక్రమ రవాణాకు తెగబడుతున్నారు. పగలైతే నిఘా ఉంటుందని...రాత్రిళ్లు, అందులోనూ అర్ధరాత్రి 12 నుంచి తెల్లవారుజామున 5 గంటల మధ్య టార్గెట్ రీచ్ అవుతున్నారు. జిల్లాలో బుడుగుంటపల్లె వద్ద స్టాక్ పాయింట్ ప్రారంభించి దాదాపు రెండు నెలలు కావస్తున్నా ఇప్పటికీ మిగతా ప్రాంతాల్లో ఇతర రీచ్‌లుగానీ, స్టాక్ పాయింట్లు ఏర్పాటు చేయకపోవడంతో ఇసుకకు తీవ్ర డిమాండ్ ఏర్పడుతోంది.


ములకలచెరువు వద్ద సీజ్ చేసిన ఇసుకలో కొంత భాగాన్ని అక్రమంగా తరలించగా మిగిలిన ఇసుక

ములకల చెరువులో సీజ్ చేసిన ఇసుకను తరలించిన టీడీపీ నాయకులు

జిల్లాలో ఎక్కడపడితే అక్కడ ఇసుకను తెలుగు తమ్ముళ్లు తోడేస్తున్నారు. ప్రభుత్వం సరఫరా చేసే ఇసుక దూర ప్రాంతాలకు రోజుల తరబడి నడుస్తుండడంతో వీరికి కలిసి వస్తోంది. ఇసుక కొరతతో చాలా చోట్ల భవన నిర్మాణాలు కూడా నత్తనడకన సాగుతున్నాయి. దీంతో భవన నిర్మాణ కార్మికులు కూడా పనులు లేక అల్లాడిపోతున్నారు. రాత్రిళ్లు మదనపల్లె సమీపంతోపాటు చెయ్యేరు పరీవాహక ప్రాంతాలు, బహుదా, తంబళ్లపల్లె సమీప ప్రాంతాల్లోని వాగులు, వంకల్లో ఉన్న ఇసుకను రాత్రికి రాత్రి తరలిస్తున్నారు. ఎన్నికల అనంతరం జిల్లాలోని రాయచోటి, ములకలచెరువు, పీలేరు, రాజంపేట తదితర ప్రాంతాల్లో ఉన్న ఇసుకను అధికారంలోకి రాగానే అక్రమంగా తరలించేశారు. ఇటీవల ములకలచెరువులో కూడా సీజ్ చేసిన ఇసుకను కూడా టీడీపీ శ్రేణులు తరలిస్తుండగా వైఎస్సార్‌సీపీ నాయకులు పట్టుకున్నారు.

మదనపల్లె శివారుకు రావాలంటే... రూ. 30 వేలు పెట్టాల్సిందే

జిల్లాలో బాలరాజుపల్లె సమీపంలోని బుడుగుంటపల్లె వద్ద ఉన్న రీచ్ నుంచి ఇసుకను బయటికి తెచ్చి స్టాక్ పాయింట్ ఏర్పాటు చేశారు. అంతవరకు బాగానే ఉన్నా...ఇక్కడ అందరికీ అందడం గగనంగా మారుతోంది. ప్రధానంగా బుకింగ్ కేంద్రాల వద్ద..ఇసుక పాయింట్ వద్ద కూడా అధికార పార్టీ నాయకులు సిఫార్సుల మేరకు రవాణా జరుగుతోంది. మిగిలిన వారికి రోజుల తరబడి నిరీక్షణ తప్పడం లేదు. ఉచితంగా ఇసుక అందిస్తున్నామని ప్రభుత్వం చెబుతున్నా లోడింగ్, అన్‌లోడింగ్, రవాణా చార్జీలు కలుపుకుంటే బండెడు ఖర్చు వస్తోంది. బుడుగుంటపల్లె నుంచి మదనపల్లె నియోజకవర్గంలోని శివారు ప్రాంతానికి కిలోమీటర్ల మేర లెక్కవేస్తే దాదాపు 120 –130 కిలోమీటర్లు వస్తోంది. 18 టన్నుల టిప్పర్ ఇసుక సరాసరి రూ. 28నుంచి 30 వేల వరకు వినియోగదారునికి ఖర్చు వస్తోంది. మదనపల్లెకే కాదు...తంబళ్లపల్లె నియోజకవర్గంలోని ప్రాంతాలకు వెళ్లాలన్నా కూడా ఇదే పరిస్థితి. పీలేరు, తంబళ్లపల్లె, మదనపల్లె, రైల్వేకోడూరు ప్రాంతాల ప్రజలు మాత్రం ఇసుక అంటేనే బంగారమన్నట్లు భావిస్తున్నారు.


గతంలో రాయచోటి మాసాపేటలోని స్టాక్ పాయింట్‌ను తరలించడంతో కనిపించని ఇసుక

సరిహద్దులు దాటిస్తున్నారు



జిల్లాలోని పలు ప్రాంతాలతోపాటు మదనపల్లె నియోజకవర్గంలో అడ్డూ అదుపు లేకుండా కూటమి శ్రేణులు ఇసుకను కర్ణాటకకు తరలిస్తున్నారు. జిల్లాలోని రాజంపేట నియోజకవర్గంలో ఇసుక రీచ్ ఏర్పాటు చేసి మిగతా నియోజకవర్గాల్లో ఏర్పాటు చేయకపోవడంతో యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా జరుగుతోంది. ధనార్జనే ధ్యేయంగా ఇష్టానుసారంగా తరలించుకుపోతున్నా కనీసం పట్టించుకునే పరిస్థితే లేకుండా పోయింది. ఇసుక అక్రమ రవాణాను అడ్డుకోవాల్సిన బాధ్యత అధికారులపై ఉంది.

– సాంబశివ, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి, మదనపల్లె

చాలా కష్టంగా ఉంది



మాది కర్నూలు జిల్లా ఆళ్లగడ్డ. అక్కడ పనులు లేక బతుకుదెరువుకు ఇక్కడకు వచ్చాం.ఇక్కడ చూస్తే మూడు నెలలకు పైగా ఇసుక లేదు. పనులు కూడా లేవు. దీంతో కూలీ పనులకు వెళ్లే మాలాంటి వారికి పూటగడవడం చాలా కష్టంగా ఉంది. ఊరుగాని ఊరిలో అప్పు దొరకడంలేదు. పనులులేక కడుపు నింపుకునేందుకు మేము పడుతున్న బాధలు దేవుడికే ఎరుక.

– దేరంగుల వెంకటస్వామి, భవననిర్మాణ కూలీ, రాజంపేట

సురక్షిత ప్రయాణమే ఆర్టీసీ ధ్యేయం: మంత్రి


బస్సులను ప్రారంభిస్తున్న మంత్రి మండిపల్లి

రాయచోటి అర్బన్: ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చడమే ధ్యేయంగా ఆర్టీసీ పనిచేస్తోందని రాష్ట్ర రవాణా ,క్రీడలు, యువజన శాఖామంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి అన్నారు. గురువారం ఆర్టీసీ బస్టాండులో రాయచోటి నుంచి వివిధ ప్రాంతాలకు వెళ్లే 9 బస్సులను ఆయన జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ త్వరలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.అనంతరం మంత్రి స్వయంగా ఆర్టీసీ బస్సులో కూర్చుని ఎస్ఎన్ కాలనీ, చల్లంపల్లె వద్ద గల డిపో వరకు ప్రయాణించారు. డీఎం ధనుంజయ, డీపీటీఓ రాము తదితరులు పాల్గొన్నారు.

- మాజీ మున్సిపల్ ఛైర్మన్ వీరభద్రయ్య అన్ని వర్గాలకు చెందిన వ్యక్తి అని మంత్రి అన్నారు. వడ్డెపల్లె వద్ద ఏర్పాటు చేసిన వీరభద్రయ్య విగ్రహాన్ని ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో డాక్టర్ లక్ష్మీప్రసాద్, హక్కుల సంఘం నేత టి.ఈశ్వర్, చైతన్య విద్యాసంస్థల ఏజీఎం రమణ, వడ్డెర విద్యావంతుల వేదిక నేతలు మారుతి, చంద్రోఖర్, జీవానందం, పాల్గొన్నారు.

పాడి రైతుల సంక్షేమానికి ప్రత్యేక చర్యలు

చిన్నమండెం: పాడి రైతుల సంక్షేమానికి ప్రభుత్వం చర్యలు తీసకుంటోందని మంత్రి రాంప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం బోరెడ్డిగారిపల్లెలో ఉచిత గర్భకోశ వ్యాధుల చికిత్స శిబిరం, లేగ దూడల ప్రదర్శన కార్యక్రమం నిర్వహించారు.మంత్రి గోపూజ నిర్వహించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం బోరెడ్డిగారిపల్లెలోని తమ నివాసంలో ప్రజాదర్బార్ కార్యక్రమాన్ని మంత్రి నిర్వహించారు.

అన్నమయ్య డ్యాం పనులు రద్దు సరికాదు

- ఎంపీ పీవీ మిథున్‌రెడ్డి

రాజంపేట: అన్నమయ్య డ్యాం పునఃనిర్మాణ పనులను పూర్తి చేయాలని, ఆ బాధ్యత రాష్ట ప్రభుత్వానిదేనని రాజంపేట ఎంపీ పీవీ మిధున్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథరెడ్డి స్వగృహంలో విలేకరులతో ఎంపీ మాట్లాడారు. అన్నమయ్య డ్యాం తెగిపోయినప్పుడు, వరద ప్రాంతాల్లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పర్యటించారన్నారు. డ్యాంను పునఃనిర్మాణం చేస్తామన్నారు. చెప్పిన మాట ప్రకారం కాంక్రీట్ డ్యాం పద్ధతి నిర్మాణానికి టెండర్లను పిలిచారన్నారు. పనులు దక్కించుకున్న నిర్మాణ సంస్థ పునఃనిర్మాణం పనులు చేపట్టిందన్నారు. ఈలోగా సార్వత్రిక ఎన్నికలు వచ్చాయన్నారు. ప్రభుత్వం మారిపోయిందన్నారు. కొత్త ప్రభుత్వం పనుల రద్దుకు ప్రత్యేక జీవో తెచ్చిందన్నారు. ఈ లెక్కన అన్నమయ్య డ్యాం పనులకు బ్రేక్ పడిందన్నారు. డ్యాం పునఃనిర్మాణ పనులను పునరుద్ధరించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాల్సి ఉందన్నారు. 25శాతం పనులు జరగని డ్యాం పనులను నూతన ప్రభుత్వం నిలిపివేసిందని గుర్తుచేశారు. ఈమేరకు జీవో కూడా జారీ చేసిందన్నారు. ఇందులో భాగంగా అన్నమయ్య డ్యాం పనులను రద్దు చేయవద్దని కోరుతున్నట్లు తెలిపారు. గాలేరు నగిరి సుజల స్రవంతి ప్రాజెక్టు పనులు రాజంపేట, రైల్వేకోడూరులో చేపట్టాలన్నారు. ‘జీఎన్ఎస్ఎస్ కాలువ పనులు త్వరితగతిన చేపట్టాలన్నారు. అమరావతి అభివృద్ధికి. రూ.50వేల కోట్ల కేటాయించడమే కాకుండా అమరావతితోపాటు అన్ని ప్రాంతాలను కూడా అభివృద్ధి చేయాల్సిన ఆవశ్యకత ప్రభుత్వంపై ఉందన్నారు.


ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథ్‌రెడ్డి స్వగృహంలో మాట్లాడుతున్న రాజంపేట ఎంపీ పీవీ మిథున్‌రెడ్డి

డైవర్షన్ పాలిటిక్స్ బాబుకు వెన్నతోపెట్టిన విద్య

డైవర్షన్ పాలిటిక్స్ చంద్రబాబుకు వెన్నతోపెట్టిన విద్య అని రాజంపేట ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ఆకేపాటి అమరనాథరెడ్డి ధ్వజమెత్తారు. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న లడ్డూ విశిష్టతను సీఎం చంద్రబాబునాయుడు అప్రతిష్టపాలు చేశారన్నారు. ఆ పాపం ఆయనను వెంటాడకతప్పదన్నారు. సమావేశంలో మున్సిపాలిటి చైర్మన్ పోలా శ్రీనువాసులరెడ్డి, వైఎస్‌చైర్మన్ మర్రి రవి, జడ్పీ మాజీ వైఎస్‌చైర్మన్ ఇరగంరెడ్డిసుబ్బారెడ్డి, పార్టీ ముఖ్యనేతలు రమేష్‌నాయుడు, దొడ్డిపల్లె భాస్కర్‌రాజు, పాపినేనివిశ్వనాథరెడ్డి, దండుగోపి, దాసరి పెంచలయ్య, సిద్ధవటం మార్కెట్‌కమిటి మాజీ చైర్మన్ ఏకులరాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు మేలు చేయండి బాబూ

రైల్వేకోడూరు అర్బన్: చంద్రబాబు నేతృత్వంలో కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టినప్పటి నుంచి పాలనపై దృష్టి పెట్టకుండా మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఏ విధంగా కీడు చేయాలని నిత్యం ఆలోచిస్తూ 100 రోజుల కాలం గడిపేశారని.. అది మాని ప్రజలకు మేలు చేయడానికి పథకాలు అమలు చేయాలని ఎంపీ మిథున్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు సూచించారు. గురువారం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో వారు విలేకరులతో మాట్లాడుతూ 120 కోట్లమంది ఆరాధ్య దైవమైన వెంకటేశ్వరస్వామిని కూడా రాజకీయాల కోసం వాడుకోవడం చంద్రబాబుకే చెల్లిందని విమర్శించారు.

- మంగంపేట గనులను నమ్మకుని ప్రజలు అప్పులు చేసి పెట్టుబడులు పెట్టి 100కు పైగా మిల్లులు కట్టుకొన్నారని వారు తెలిపారు. వాటికి ముగ్గురాయి ఇవ్వకుండా ఇబ్బందులు పెడుతూ వాటిని మూసేసే విధంగా చేస్తున్నారన్నారు. వెంటనే వారికి రాయితీలు ఇచ్చి మిల్లులు నడిచే విధంగా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పుల్లంపేట మండల అధ్యక్షుడు బుద్దా బాబుల్‌రెడ్డి, వైస్ ఎంపీపీ రామిరెడ్డి ధ్వజారెడ్డి, వత్తలూరు సాయికిషోర్‌రెడ్డి, జెడ్పీటీసీ రత్నమ్మ, తోట శివసాయి, సీహెచ్ రమేష్, మండల నాగేంద్ర, తల్లెం భరత్‌కుమార్‌రెడ్డి, అన్వర్ బాషా పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలలో లక్ష్యాన్ని సాధించాలి

కలెక్టర్ చామకూరి శ్రీధర్

రాయచోటి: జిల్లాలో ప్రభుత్వం చేపట్టిన ఇళ్ల నిర్మాణాలలో లక్ష్యాలను పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి అన్ని మండలాల ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్లు, హౌసింగ్, ఆర్‌డబ్ల్యూఎస్ తదితర శాఖల సిబ్బందితో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకం కింద 78.221 ఇళ్లకు గాను 44 శాతం పూర్తయ్యాయన్నారు. మిగతా వాటిపై దృష్టి సారించి పూర్తి చేయాలన్నారు.


మాట్లాడుతున్న కలెక్టర్ చామకూరి శ్రీధర్

లక్ష్యసాధనకు కృషి చేయాలి

ప్రతి జిల్లా అధికారి తన శాఖకు సంబంధించి లక్ష్యాలను స్పష్టంగా, నిర్దిష్టంగా ఇవ్వాలని కలెక్టర్ చామకూరి శ్రీధర్ ఆదేశించారు. లక్ష్యసాధనకు అందరూ కృషి చేయాలని సూచించారు. గురువారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో అన్నిశాఖల జిల్లా అధికారులతో సమావేశాన్ని నిర్వహించారు. డిసెంబర్ 31 నాటికి పూర్తయ్యే మరో వంద రోజుల పాలనపై ప్రణాళికను సిద్ధం చేయాలని కలెక్టర్ ఆదేశించారు.

క్లుప్తంగా

రూ. 25.50 లక్షలకు ఐపీ దాఖలు

పీలేరు రూరల్ : పీలేరు పట్టణం యర్రమరెడ్డి గుట్టలో నివాసముంటున్న మూడే వాసుదేవ నాయక్ స్థానిక సీనియర్ సివిల్ జడ్జి కోర్టులో రూ. 25.50 లక్షలకు ఐపీ దాఖలు చేశాడు. వివరాలిలా ఉన్నాయి. వాసుదేవనాయక్ కొన్నేళ్లుగా వరి, వేరుశనగ, ఉలవలు సీజనల్ వ్యాపారంతోపాటు గొర్రెలు, మేకల వ్యాపారం చేసేవాడు. వ్యాపారం అభివృద్ధి చేసే క్రమంలో పీలేరు మండలానికి చెందిన ఇద్దరి వద్ద, కేవీ పల్లె మండలం ఆవులయ్యగారిపల్లెలో ఓ వ్యక్తి వద్ద, వీరబల్లి మండలంలో ఒకరి వద్ద, టి.సుండుపల్లె మండలం పెద్దినేనికాల్వ పరిసర గ్రామాల్లో 13 మంది వద్ద మొత్తం 17 మంది వద్ద రూ. 25.50 లక్షలు అప్పు చేశాడు. వ్యాపారంలో నష్టం రావడంతో తిరిగి చెల్లించలేని స్థితిలో ఐపీ దాఖలు చేసినట్లు తెలిపాడు.

దళితుల స్మశానాన్ని కాపాడండి



స్మశాన వాటిక సమీపంలో రోడ్డుపై బైఠాయించిన గ్రామస్తులు

సుండుపల్లె : మండల పరిధిలోని గల్లావాండ్ల పల్లె సమీపంలోని దళితుల స్మశాన వాటికను ఓ రియల్ ఎస్టేట్ వ్యాపారి నుంచి కాపాడాలని గ్రామస్తులు మండల కేంద్రంలోని నాలుగురోడ్ల కూడలి వద్ద గురువారం ధర్నా నిర్వహించారు. అనంతరం అక్కడ నుంచి వెళ్లి స్మశాన వాటిక దగ్గర మహిళలు రోడ్డుపై బైఠాయించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ ఈ స్మశాన వాటికలో రియల్ ఎస్టేట్ వ్యాపారి తమ ప్లాట్లకు రహదారిని నిర్మించుకునేందుకు చదును చేసినట్లు తెలిపారు. ఈ ఆక్రమణపై చర్యలు తీసుకోవాలని తహసీల్దార్‌కు వినతిపత్రం ఇచ్చినప్పటికీ రెవెన్యూ అధికారులు సహకరించడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు.

దొంగలున్నారు.. జరభద్రం

- దసరా సెలవులకు ఊరెళుతున్నారా..
- తస్మాత్ జాగ్రత్త



రాజంపేట టౌన్ : పాఠశాలలకు దసరా సెలవులు వచ్చేశాయి. అనేక మంది నెల రోజులకు ముందుగానే దసరా సెలవులకు తమ సొంతూర్లకు, బంధువుల ఊర్లకు వెళ్లేందుకు ప్రణాళికలు కూడా రూపొందించుకొని ఉన్నారు. అందువల్ల చాలా మంది ఊర్లకు పయనం అయ్యేందుకు సిద్ధమవుతున్నారు. ఇటీవల జిల్లాలో నిత్యం ఏదో ఒక చోట దొంగతనాలు జరుగుతూనే ఉన్నాయి. దొంగలు తాళాలు వేసిన ఇళ్లనే లక్ష్యంగా చేసుకొని దొంగతనాలకు పాల్పడుతున్నారు. ప్రధానంగా ఇటీవల రాజంపేట, రైల్వేకోడూరు నియోజకవర్గాల్లో వరుసగా దొంగతనాలు జరుగుతుండటంతో ఈ రెండు నియోజకవర్గాల్లో దొంగల ముఠా ఏమైనా ఉందా అన్న చర్చ కూడా ప్రజల్లో సాగుతోంది. కాగా సెలవుల్లో ఊర్లకు వెళ్లే వాళ్లు తమ ఇళ్లకు గట్టి భద్రత ఏర్పాటు చేసుకోవాలని, అలాగే డబ్బులు, బంగారు నగలు వంటి విలువైన వస్తువులు చోరీకి గురికాకుండా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని పోలీసు అధికారులు సూచిస్తున్నారు.

ఇలాంటి జాగ్రత్తలు తప్పనిసరి

ఊరికెళ్లేవారు కొన్ని జాగ్రత్తలు తీసుకుంటే చోరీలను అరికట్టవచ్చని పోలీసు అధికారులు సూచిస్తున్నారు. అవి ఏమిటంటే....

- బంగారు ఆభరణాలు లాకర్లలో పెట్టుకోవడం శ్రేయస్కరం
- లాకర్ల సదుపాయం లేని వారు నమ్మకస్తులైన బంధువులు, స్నేహితుల ఇళ్లల్లో బంగారు నగలను భద్రపరుచుకోవాలి
- ఆర్థిక స్థోమత గల వారు ఇళ్ల వద్ద సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలి.
- ఆర్థిక స్థోమత లేని వారు రాత్రి వేళల్లో తమ బంధువులను కాని, స్నేహితులను కాని తమ ఇళ్లల్లో నిద్రించే ఏర్పాటు చేసుకోవాలి
- ఇంటి ప్రధానమైన తలుపునకు పటిష్టమైన తాళం వేసి కనిపించకుండా కర్టెన్ వేయాలి
- ఇరుగు, పొరుగు వారిని అప్పుడప్పుడు ఇంటిని గమనిస్తూ ఉండమని చెప్పాలి
- ఊరికి వెళ్లాక రోజుకు ఒకసారి అయినా ఇరుగు, పొరుగు వారికి ఫోన్ చేసి ఇంటి గురించి వాకబు చేయాలి
- ఊర్లకు వెళ్లేవారు ఎట్టి పరిస్థితుల్లో తమ వెంట బంగారాన్ని బ్యాగుల్లో పెట్టి తీసుకెళ్లకూడదు

ప్రయాణ సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు

- ముఖ్యంగా రైళ్లల్లో ప్రయాణించేవారు తమ లగేజీ బ్యాగులకు చైన్‌వేసి తాళం వేసుకోవాలి
- రైల్వేస్టేషన్, బస్టాండుల్లో మంచినీళ్లకు, వాష్ రూంకు వెళ్లే సమయంలో తెలియని వారికి ఎట్టి పరిస్థితుల్లో లగేజీని అప్పగించకూడదు
- రైళ్లల్లో కిటికి పక్కన కూర్చునేవారు మెడలో వేసుకునే బంగారు నగలు బయటకు కనిపించకుండా జాగ్రత్తపడాలి
- తోటి ప్రయాణికులు ఏవైనా తినుబండారాలు ఇచ్చినా సున్నితంగా తిరస్కరించాలి

పోలీస్ స్టేషన్‌లో తెలియజేయండి



దసరా సెలవుల్లో ఎవరైనా ఊరికి వెళ్లేవారు సమీపంలోని పోలీస్ స్టేషన్‌లో తెలియజేస్తే వారి ఇళ్లపై రాత్రి వేళల్లోనే కాక పగలు కూడా తమ సిబ్బందిచే ప్రత్యేకంగా నిఘా పెట్టిస్తాము. ఇటీవల వరుసగా దొంగతనాలు జరుగుతున్నందున ఊర్లకు వెళ్లే ప్రజలు కూడా చోరీలు జరగకుండా తమ ఇళ్లకు గట్టి భద్రత ఏర్పాటు చేసుకోవాల్సిన అవసరం ఉంది. రాత్రి వేళల్లో గస్తీని మరింత పెంచుతాము. దొంగలకు అవకాశం ఇవ్వకుండా ప్రజలు తగు జాగ్రత్తలు తీసుకోవాలి.

– ఎస్.సుధాకర్, డీఎస్పీ, రాజంపేట

252 మొబైల్ ఫోన్లు బాధితులకు అప్పగింత

- వాటి విలువ రూ. 40 లక్షలు
- సిబ్బందిని అభినందించిన ఎస్పీ

రాయచోటి : పోగొట్టుకున్న, చోరీకి గురైన విలువైన మొబైల్ ఫోన్లను అన్నమయ్య జిల్లా పోలీసులు రికవరీ చేసి బాధితులకు అప్పగించారు. అందుబాటులోకి వచ్చిన అధునాతన సాంకేతికతతో ఒక కోటి, 96 లక్షల రూపాయలు విలువచేసే ఫోన్లను పోలీసులు రాబట్టారు. గురువారం జిల్లా వ్యాప్తంగా పోలీసుల ఆధ్వర్యంలో సేకరించిన మొబైళ్లతో రాయచోటి పోలీస్ ప్రధాన కార్యాలయంలో మొబైల్ రికవరీ మేళాను ఎస్పీ విద్యాసాగర్ నాయుడు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా మీడియా సమావేశంలో ఎస్పీ మాట్లాడుతూ జిల్లాలో 2023వ సంవత్సరం సెప్టెంబర్ నెల నుంచి 2024వ సంవత్సరం సెప్టెంబర్ నెల వరకు పోగొట్టుకున్న సెల్‌ఫోన్లను జిల్లా స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ టీవీ సత్యనారాయణ, సైబర్ క్రైమ్ ఇన్‌స్పెక్టర్ ఎం.మంజునాథ్ రెడ్డిల ఆధ్వర్యంలో సైబర్ క్రైమ్ సిబ్బంది రికవరీ చేశారన్నారు. గతంలో ఐదు సార్లు ఇలాగే ఫోన్లను రికవరీ చేసి బాధితులకు ఇచ్చామన్నారు. ప్రస్తుతం 6వ సారి రూ. 40 లక్షలు విలువగల 252 మొబైల్ ఫోన్లను రికవరీ చేసి అందజేశామన్నారు. రాష్ట్రంలోనే కాకుండా ఇతర రాష్ట్రాలకు చెందిన బాధితుల ఫోన్లను రికవరీ చేసి ఇవ్వడం పట్ల బాధితులు ఆనందం వ్యక్తం చేశారు. మొబైల్ ఫోన్ పోగొట్టుకున్నట్లయితే జిల్లా పోలీస్ ఎల్‌ఎంటీఎస్ వాట్సప్ నంబర్. 8688830012కు హాయ్ అని మెసేజ్ చేసిన వెంటనే ఒక గూగుల్ లింక్‌ను రిసీవ్ చేసుకుంటారని ఎస్పీ తెలిపారు. ఆ లింకును క్లిక్ చేసి మీ వివరాలు, మీ మొబైల్ ఐఎంఈఐ నంబరు తదితర వివరాలు తెలియపరుస్తూ ఆ మొబైల్‌ను కొన్న బిల్ పేపర్ లేదా మొబైల్ బాక్సును అప్‌లోడ్ చేసి సబ్మిట్ చేయాలన్నారు. మొబైల్స్‌ను రికవరీ చేసి బాధితులకు అందజేయడంలో కృషి చేసిన స్పెషల్‌బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ, సైబర్ క్రైమ్ ఇన్‌స్పెక్టర్ మంజునాథ రెడ్డి, సైబర్ క్రైమ్ టీమ్ సభ్యులు బి నరసింహ నాయక్, ఎ రవి శేఖర్, ఎస్ అబ్దుల్ సాహూల్, జె రాధ, ఎస్ ఫామిన్ అరాస్, కె ఇలియాజ్, ఎస్ దేవేంద్రలను జిల్లా ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.



మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు

దసరా నవరాత్రుల్లో పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు

దసరా పండుగ సందర్భంగా జిల్లాలో పటిష్టమైన భద్రతా ఏర్పాట్లను చేసినట్లు జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు తెలిపారు. గురువారం ఎస్పీ కార్యాలయంలో ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. జిల్లా ప్రజలు భక్తి శ్రద్ధలతో దసరా పండుగ జరుపుకోవాలన్నారు. పండుగ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులను దేవాలయాల వద్ద నిఘా ఉంచామని తెలిపారు. గత వినాయక చవితి ఉత్సవాలలో గొడవలు చేసిన వారిని అరెస్టు చేశామన్నారు. దసరా నవరాత్రులలో అల్లర్లకు పాల్పడితే, అశ్లీల నృత్యాలు చేస్తూ డీజే సౌండ్‌ల ద్వారా ప్రజలకు ఇబ్బంది కలిగిస్తే కేసులు నమోదు చేసి బైండోవర్ చేస్తామన్నారు. దసరా సందర్భంగా సొంత గ్రామాలకు వెళ్లేవారు, స్థానిక పోలీస్ స్టేషన్‌లో సమాచారం ఇస్తే ఎల్‌హెచ్‌ఎంఎస్ కెమెరా ద్వారా, పోలీసు పెట్రోలింగ్ ద్వారా నిఘా ఉంచుతామని తెలిపారు.

నేటి నుంచి అండర్–14 మల్టీడేస్ క్రికెట్ టోర్నీ

– తలపడనున్న 7 జిల్లాల జట్లు

కడప స్పోర్ట్స్ : కడప నగరంలోని వైఎస్ రాజారెడ్డి–ఏసీఏ క్రికెట్ మైదానం, కేఎస్ఆర్ఎం, కేఓఆర్ఎం మైదానాలు వేదికగా ఈనెల 4 నుంచి 23వ తేదీ వరకు ఏసీఏ అండర్–14 మల్టీడేస్ క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం కానుంది. కడప, కర్నూలు, చిత్తూరు, ప్రకాశం, విశాఖపట్నం, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి జట్లు ఈ పోటీల్లో తలపడనున్నాయి. పోటీల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు క్రికెట్ అసోసియేషన్ ఆఫ్ వైఎస్ఆర్ డిస్ట్రిక్ట్ (సీఏవైడీ) ప్రతినిధులు తెలిపారు.

జిల్లా జట్టు ప్రకటన..

ఏసీఏ అండర్–14 అంతర్ జిల్లాల మల్టీడేస్ క్రికెట్ టోర్నమెంట్‌లో పాల్గొనే జిల్లా అండర్–14 బాలుర జట్టును సీఏవైడీ కార్యదర్శి ఎ. రెడ్డిప్రసాద్ ప్రకటించారు. ఇటీవల ఎంపికలు నిర్వహించి, ప్రాక్టీస్ మ్యాచ్‌ల నిర్వహణ అనంతరం ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను తుది జట్టుకు ఎంపిక చేసినట్లు తెలిపారు.

అండర్–14 జిల్లా జట్టు : పి. హితేష్ (కెప్టెన్), సి.వి.ఎస్. ప్రశాంత్, జి.సూర్యతేజ్‌రెడ్డి, ఎ. అభినివేష్‌రెడ్డి, ఎం.జగదీశ్వర్‌రెడ్డి, కె. లోకేష్, ఎస్ఎండీ తాహీర్, జె.పి.ఖలీద్, ఆర్. యోగాంజనేయులు, ఎస్ఎండీ ఫైజాన్, ఆర్.పి. ఇమ్మానుయేల్, బి.సాయికృష్ణచైతన్య, పి.అస్జద్‌అలీఖాన్, బి.మునిజ్ఞానేశ్వర్‌రెడ్డి, జి. ఆదిత్య, జి.మానస్‌నందన్, పి.అష్కన్‌ఖాన్, ఎ.చెన్నకేశవ. స్టాండ్‌బై: వి.రామ్‌చరణ్, యు. శివచరణ్, ఎస్.భానువర్షిత్‌రెడ్డి, ఎస్ఎండీ ఉమైర్‌సిద్ధిక్, జి. భవిత్ రెడ్డి, ఎం.వర్షిత్‌కుమార్, వి.శేరనయరెడ్డి.

తేదీ	తలపడే జట్లు	వేదిక
4 నుంచి 5 వరకు	చిత్తూరు–కర్నూలు	వైఎస్ఆర్ఆర్
4 నుంచి 5 వరకు	విశాఖపట్నం– ప్రకాశం	కేఎస్ఆర్ఎం
4 నుంచి 5 వరకు	కడప–పశ్చిమగోదావరి	కేఓఆర్ఎం
7 నుంచి 8 వరకు	విశాఖ– తూర్పుగోదావరి	వైఎస్ఆర్ఆర్
7 నుంచి 8 వరకు	చిత్తూరు –పశ్చిమగోదావరి	కేఎస్ఆర్ఎం
7 నుంచి 8 వరకు	కడప – ప్రకాశం	కేఓఆర్ఎం
10 నుంచి 11 వరకు	చిత్తూరు –ప్రకాశం	వైఎస్ఆర్ఆర్
10 నుంచి 11 వరకు	కడప–తూర్పుగోదావరి	కేఎస్ఆర్ఎం
10 నుంచి 11 వరకు	విశాఖపట్నం – కర్నూలు	కేఓఆర్ఎం
13 నుంచి 14 వరకు	ప్రకాశం – పశ్చిమగోదావరి	వైఎస్ఆర్ఆర్
13 నుంచి 14 వరకు	కడప – కర్నూలు	కేఎస్ఆర్ఎం
13 నుంచి 14 వరకు	చిత్తూరు–తూర్పుగోదావరి	కేఓఆర్ఎం
16 నుంచి 17 వరకు	విశాఖపట్నం –కడప	వైఎస్ఆర్ఆర్
16 నుంచి 17 వరకు	ప్రకాశం–కర్నూలు	కేఎస్ఆర్ఎం
16 నుంచి 17 వరకు	తూర్పుగోదావరి– పశ్చిమగోదావరి	కేఓఆర్ఎం
19 నుంచి 20 వరకు	కర్నూలు –పశ్చిమగోదావరి	వైఎస్ఆర్ఆర్
19 నుంచి 20 వరకు	చిత్తూరు– విశాఖపట్నం	కేఎస్ఆర్ఎం
19 నుంచి 20 వరకు	తూర్పుగోదావరి – ప్రకాశం	కేఓఆర్ఎం
22 నుంచి 23 వరకు	కడప – చిత్తూరు	వైఎస్ఆర్ఆర్
22 నుంచి 23 వరకు	తూర్పుగోదావరి – కర్నూలు	కేఎస్ఆర్ఎం
22 నుంచి 23 వరకు	పశ్చిమగోదావరి – విశాఖపట్నం	కేఓఆర్ఎం

విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం

ప్రమాదంలో రూ.13 లక్షల ఆస్తినష్టం

కలకడ : కరెంట్ కోతలు ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లోని ఇళ్లల్లో ఇన్వర్టర్ ఉంటే దాదాపు అన్ని సమస్యలూ తీరిపోయినట్టే. కరెంట్ పోయిన ప్రతిసారీ నిశ్చింతగా ఉండవచ్చు. విద్యుత్ అంతరాయానికి విసిగిపోయి ఓ వ్యక్తి ఇన్వర్టర్ కొనుగోలు చేశాడు. అయితే గురువారం అధిక విద్యుత్ సరఫరా అయి ఇన్వర్టర్‌లో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ ఏర్పడి ఇల్లు దగ్ధమైంది. కలకడలోని రాజీవ్‌నగర్ కాలనీకి చెందిన సయ్యద్‌బాషాకు చెందిన ఇల్లు గురువారం విద్యుత్ సర్క్యూట్‌తో దగ్ధం కావడంతో ఇంటిలోని వస్తువులన్నీ కాలి బూడిదయ్యాయి. స్థానికుల కథనం మేరకు వివరాల్లోకి వెళితే.. రాజీవ్‌నగర్ కాలనీకి చెందిన సయ్యద్ బాషా విద్యుత్ అంతరాయం ఏర్పడటంతో లూమినస్ కంపెనీకి ఇన్వర్టర్‌ను కొనుగోలు చేశాడు. అయితే గురువారం ఉదయం అధిక విద్యుత్ సరఫరా కావడంతో ఇన్వర్టర్‌లో షార్ట్ సర్క్యూట్ వలన ఇంటిలోని వస్తువులన్నీ కాలి పోయాయి. రూ. 13 లక్షల వరకు ఆస్తి నష్టం జరిగిందని బాధితులు వాపోయాడు. ఈ ప్రమాదంపై కలకడ రెవెన్యూ శాఖ సిబ్బంది పరిశీలించి, ఆస్తి నష్టాన్ని అంచనా వేశారు. సర్వం కోల్పోయామని ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత కుటుంబం వేడుకుంటోంది.



కాలిపోయిన ఇంటిలోని వస్తువులు

టమాటా రూ.80



కలకడ మార్కెట్‌లో నిల్వ చేసిన టమాటా బాక్సులు

కలకడ : టమాటా ధరలు క్రమంగా పెరుగుతున్నాయి. దీంతో రైతులకు ఊరట లభిస్తోంది. పండగల వేళ టమాటాకు మరింత డిమాండ్ పెరిగింది. గురువారం కలకడ మార్కెట్‌లో కిలో టమాటా ధర రూ.80కి పలికింది. 15కిలోల బాక్సు ధర గరిష్టంగా రూ.1,200 పలికింది. గురువారం ఉదయం కలకడ మార్కెట్‌కు వచ్చిన రైతులు 15 కిలోల టమాటా బాక్స్ ధర రూ.1,200 పలకడంతో కష్టానికి తగిన ఫలితం దక్కిందని హర్షం వ్యక్తం చేశారు. ఈ మాత్రం ధరలు నిలకడగా కొనసాగితే తమకు గిట్టుబాటు అవుతుందని అంటున్నారు. పెట్టుబడి పోను లాభాలు మిగుల్తాయని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. అధిక కమీషన్, గేట్, వంటివి లేకపోవడంతో తిరుపతి జిల్లా బాకరాపేట, కడప జిల్లా, అన్నమయ్య జిల్లా బి.కొత్తకోట నుంచి కలకడ మార్కెట్‌కు అధికంగా రైతులు వచ్చినట్లు వ్యాపారులు తెలిపారు.

చెరువునూ వదలని టీడీపీ వర్గీయులు

- గొల్లపల్లి చెరువు ఆక్రమణను అడ్డుకోవాలని గ్రామస్తుల డిమాండ్
- ఈ మేరకు కలెక్టర్‌కు ఫిర్యాదు

లక్కిరెడ్డిపల్లి : మండలంలోని చౌటపల్లి పంచాయతీ, గొల్లపల్లికి ఆనుకొని ఉన్న చెరువును కొంతమంది టీడీపీ వర్గీయులు తమ సొంత ప్రయోజనాల కోసం మట్టితో పూడ్చి వేసి ఆక్రమించుకుంటున్నారని అదే గ్రామానికి చెందిన చెల్లు రవి, రాజతోపాటు పలువురు బుధవారం లక్కిరెడ్డిపల్లిలో జరిగిన గ్రామ సభలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా గురువారం వారు విలేకరులతో మాట్లాడుతూ చెరువులో అక్రమంగా మట్టిని తొలగిస్తున్న జేసీబీతోపాటు ట్రాక్టర్లను వెంటనే సీజ్ చేయాలని తహసీల్దార్‌కు కలెక్టర్ సూచించినా ఏమాత్రం పట్టించుకోలేదని ఆరోపించారు. ఇప్పటికే గొల్లపల్లి చెరువును పలువురు ఆక్రమించుకొని పూడ్చివేసి షెడ్లు వేశారన్నారు. పరిస్థితి ఇలాగే ఉంటే మరికొద్ది రోజుల్లో చెరువు పూర్తిగా ఆక్రమణకు గురికాక తప్పదన్నారు. చెరువులో ఒక వైపు ఎన్నో ఏళ్లుగా సమాధులు వేసుకుని ఉన్నా కొంతమంది అధికారాన్ని అడ్డుపెట్టుకొని జేసీబీ సాయంతో తొలగించే ప్రయత్నం చేశారన్నారు. గంగమ్మ జాతరకు వెళ్లే రోడ్డు మార్గం మొదలుకొని గొల్లపల్లి స్కూల్ బిల్డింగ్ వరకు రోడ్డుకు ఆనుకొని ఎక్కడికక్కడ కుప్పలు తెప్పలుగా మట్టి తోలేసి ఎవరికివారు వారి ఇష్టానుసారం ఆక్రమించుకుంటున్నారని పలువురు గ్రామస్తులు తెలపారు. ఇప్పటికైనా మండల రెవెన్యూ అధికారులు, జిల్లా కలెక్టర్ చొరవ చూపి చెరువు ఆక్రమణకు గురికాకుండా చూడాలని గ్రామస్తులు వేడుకుంటున్నారు.



గొల్లపల్లి చెరువులో అనుమతి లేకుండానే మట్టిని తోడేస్తున్న దృశ్యం

పల్లెకు ప్రవాసాంధ్రుని చేయూత

సంబేపల్లె : తాను పుట్టి పెరిగిన ఊరికి తన వంతు సహకారం అందించాలనే సంకల్పంతో అడిగినదే తడవుగా గ్రామ వాసుల దాహార్తి తీర్చేందుకు చేయూతనందించాడు ఓ ప్రవాస ఆంధ్రుడు. వివరాలు ఇలా.. సంబేపల్లె వాసి శశిభూషణ్ కొన్నేళ్లుగా అమెరికా సంయుక్త రాష్ట్రాల్లో ఉద్యోగరీత్యా స్థిరపడ్డారు. ప్రతి సంవత్సరం సొంత గ్రామానికి వస్తుంటారు. గ్రామంలో నీటి ఎద్దడి అధికంగా ఉందని, బోరు వేసినప్పటికీ మోటార్ ఏర్పాటుకు ఆర్థిక వనరులు ఇబ్బందికరంగా ఉందని గ్రామస్తులు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. అడిగిందే తడవుగా ఆయన రూ.2లక్షలతో విద్యుత్ మోటార్ కొనుగోలు చేసి బోరు ఏర్పాటు చేయడంతో పాటు గురువారం గ్రామస్తుల సమక్షంలో బోరుకు పూజలు చేసి ప్రారంభించారు. నీళ్లు సమృద్ధిగా రావడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. గతంలో శశిభూషణ్ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు ల్యాప్ ట్యాబ్, క్రీడా సామగ్రి, సరస్వతి అమ్మవారి విగ్రహానికి నిధులు ఇచ్చారు. గ్రామాభివృద్ధిలో తాను పాలు పంచుకోవడం ఎంతో ఆనందంగా ఉందని ఆయన వివరించారు. శశిభూషణ్ దాతృత్వానికి గ్రామస్తులు అభినందించారు.



తాగునీటి బోరును ప్రారంభిస్తున్న దాత శశిభూషణ్

గ్రీన్ అంబాసిడర్‌లకు జీతాలు చెల్లించాలి

రాయచోటి అర్బన్ : జిల్లాలోని గ్రీన్ అంబాసిడర్‌లకు పెండింగ్ జీతాలను వెంటనే చెల్లించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం. రామాంజులు డిమాండ్ చేశారు. బుధవారం పట్టణంలోని సీఐటీయూ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలోని గ్రీన్ అంబాసిడర్‌లకు పలువురికి 5 నుంచి 20 నెలల వరకు జీతాలు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. 15వ ఆర్థిక సంఘం నిధుల్లో 50 శాతం గ్రీన్‌అంబాసిడర్‌లకు జీతాల కింద చెల్లించాల్సి ఉందన్నారు.

సారా విక్రయిస్తున్న మహిళ అరెస్టు

మదనపల్లె : సారా విక్రయిస్తున్న మహిళను అరెస్టు చేసి 30 ప్యాకెట్ల సారాను స్వాధీనం చేసుకున్నట్లు టూటౌన్ ఎస్ఐ రవికుమార్ తెలిపారు. గురువారం పట్టణంలోని శివాజీ నగర్‌లో సారా విక్రయాలు జరుగుతున్నాయన్న సమాచారం మేరకు సిబ్బందితో కలిసి దాడులు చేశామన్నారు. ఎస్టేట్‌లోని శివాజీ నగర్‌కు చెందిన సురేష్ నాయక్ భార్య ఎం.రాజమ్మ(40) సారా విక్రయిస్తుండగా అదుపులోకి తీసుకున్నామన్నారు. ఆమె నుంచి రూ.2,250 విలువ చేసే 30 సారా ప్యాకెట్లను సీజ్ చేసి, నిందితురాలిపై కేసు నమోదుచేసి కోర్టుకు హాజరుపరిచినట్లు తెలిపారు.

ఆటో బోల్తా పడి ఏడుగురికి గాయాలు

మదనపల్లె : ఆటో బోల్తా పడి ఏడుగురు గాయపడిన సంఘటన గురువారం కురబలకోట మండలంలో జరిగింది. తెట్టు పంచాయతీ ఆరోగ్యపురానికి చెందిన ఆటో డ్రైవర్ కుమార్ స్థానికులకు పొలం పనులకు తీసుకెళ్లేందుకు ఆటోలో చెన్నామర్రిమిట్టకు బయలుదేరాడు. మార్గమధ్యంలో దిగువపాలెం వద్ద ఆటో అదుపుతప్పి బోల్తా పడింది. ప్రమాదంలో డ్రైవర్ కుమార్‌తో పాటు రాజమ్మ(60), సులోచన(50), అమరావతి(45), రెడ్డెప్ప(58), రమణయ్య(52), సుబ్బమ్మ(41) గాయపడ్డారు. గమనించిన స్థానికులు బాధితులను మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు.

జూదరుల అరెస్టు

మదనపల్లె : జూదం ఆడుతున్న ఐదుగురిని అరెస్ట్ చేసినట్లు వన్‌టౌన్ సీఐ చాంద్‌బాషా తెలిపారు. పట్టణంలోని నక్కలదిన్నె సమీపంలో జూదం ఆడుతున్నారన్న సమాచారం మేరకు సిబ్బందితో కలిసి దాడి చేశామన్నారు. దాడిలో మదనపల్లె పరిసర ప్రాంతాలకు చెందిన ఐదుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నామన్నారు. వారి వద్ద నుంచి రూ.17,690 నగదు స్వాధీనం చేసుకుని నిందితులపై కేసు నమోదుచేశామన్నారు.

పెద్దమండ్యంలో..

జూదం ఆడుతున్న ఐదుగురిని అరెస్ట్ చేసినట్లు ఇన్‌చార్జి ఎస్ఐ గాయత్రి తెలిపారు. ఎస్ఐ కథనం మేరకు.. మండలంలోని బండ్రేవు పంచాయతీ కొత్తపల్లె సమీపంలో జూదం జరుగుతున్నట్లు అందిన సమాచారం మేరకు సిబ్బందితో వెళ్లి దాడులు నిర్వహించినట్లు తెలిపారు. దాడుల్లో ఐదుగురు జూదరులు పట్టుబడగా, వారి నుంచి రూ. 10,200 నగదును స్వాధీనం చేసు

పీకేఎం–ఉడా వైస్ చైర్మన్‌గా ఆదర్శ్ రాజేంద్రన్



మదనపల్లె : పలమనేరు, కుప్పం, మదనపల్లె అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ(పీకేఎం–ఉడా) వైస్‌చైర్మన్‌గా అన్నమయ్య జిల్లా జాయింట్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్ నియమితులయ్యారు. గురువారం ప్రభుత్వ చీఫ్ సెక్రటరీ నీరబ్‌కుమార్ ప్రసాద్... రాష్ట్ర వ్యాప్తంగా 14 అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీలకు వైస్ చైర్మన్‌లను నియమిస్తూ ఉత్తర్వులు విడుదల చేశారు. అందులో పీకేఎం–ఉడాకు జేసీ ఆదర్శ రాజేంద్రన్‌ను కేటాయించారు. గతంలో పీకేఎం–ఉడా వైస్‌చైర్మన్‌గా పనిచేసిన బాబర్‌ను ఆయన మాతృశాఖ ఏపీపీఎస్సీకి బదిలీ చేశారు.

ముగ్గురు ఆత్మహత్యాయత్నం

మదనపల్లె : వేర్వేరు ఘటనల్లో ముగ్గురు ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. మదనపల్లె పట్టణంలోని సంతగేటుకు చెందిన రామచంద్ర కుమారుడు మహేష్(22) చీటీ కట్టేందుకు డబ్బులు లేకపోవడంతో స్నేహితులను అప్పుగా అడిగాడు. ఎవరూ అతడికి ఆర్థిక సహాయం చేయకపోవడంతో మనస్తాపం చెంది ఇంటి వద్ద పురుగుమందు తాగాడు. అదేవిధంగా లక్ష్మీ నగర్‌కు చెందిన గంగరాజు భార్య జ్యోతి కుటుంబ సమస్యలతో భర్తతో గొడవపడి విషద్రావణం తాగి ఆత్మహత్యకు యత్నించింది. గుర్రంకొండ మండలం చెర్లోపల్లెకు చెందిన బావాజాన్ భార్య రజియాబీ(22) భర్తతో గొడవపడి మనస్తాపంతో విషద్రావణం తాగింది. ఆయా ఘటనల్లో గమనించిన కుటుంబ సభ్యులు బాధితులను వెంటనే 108 వాహనాల్లో మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు.

బాలికపై అత్యాచారం

కడప అర్బన్ : కడప నగరం చిన్నచౌక్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ ఎనిమిదేళ్ల బాలికపై ఓ యువకుడు అత్యాచారానికి పాల్పడ్డాడు. పోలీసు వివరాల మేరకు తాలూకా పరిధికి చెందిన రవిశంకర్ అనే యువకుడు చిన్న చౌక్ పరిధిలో ఉన్న మహిళతో వివాహేతర సంబంధం కొనసాగిస్తున్నాడు. పది రోజుల క్రితం ఆమె ప్రసవించింది. ఈ నేపథ్యంలో ఇంట్లో ఒంటరిగా ఉన్న ఆమె కూతురిపై అత్యాచారానికి పాల్పడ్డాడు. బాలిక బంధువుల ఫిర్యాదు మేరకు యువకుడిపై పోక్సో కేసు నమోదు చేశారు.

వివాహిత ఆత్మహత్య

పెద్దముడియం : మండలంలోని జంగాలపల్లె గ్రామంలో విజయ(50)అనే వివాహిత ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం గ్రామానికి చెందిన రామయ్య, విజయ దంపతులకు ఒక కూతరు ఉంది. వీరు వ్యవసాయం చేసుకుంటూ జీవించేవారు. డిగ్రీ చదువుతున్న కూతురికి పెళ్లి చేయాలని చెప్పిన మాటలను విజయ భర్త రామయ్య పట్టించుకోలేదు. ఇదే విషయంపై దంపతులిద్దరూ గొడవపడ్డారు. దీంతో మనస్థాపం చెందిన విజయ బుధవారం రాత్రి ఇంటిలోనే ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంది.